క్లుప్తంగా

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలి



పామిడిలో సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

పామిడి: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఏపీటీఎఫ్–257 సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బీ వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో ఆ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాటాల్డుతూ విద్యావ్యవస్థకు శరాఘాతంగా మారిన జీఓ 117 వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంను సమాంతరంగా నడపాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. డీఎస్సీ–98, 2008 అభ్యర్థులను రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగించాలన్నారు. నాయకులు, సుంకప్ప, సతీష్, మల్లికార్జున, నూర్‌మహమ్మద్, రామాంజనేయులు, ఉజ్జినప్ప, సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పూర్తి చేయండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పక్కనున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్, ఏసీ లావణ్య, ఎంఈ గురప్పయాదవ్ క్యాంటీన్ భవనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్క నాటుతున్న గుత్తి ఫారెస్టు అధికారి నారపరెడ్డి

యాడికి: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని గుత్తి ఫారెస్టు సెక్షన్ అధికారి నారపరెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వన మహోత్సవంలో భాగంగా వైద్యులు పరమేశ్వర్, శ్రీరామ్ కుమార్ ఆధ్వర్యంలో 100 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నారపరెడ్డి మాట్లాడుతూ మొక్కలతో ఆక్సిజన్ వాయువు లభిస్తుందని, మనం వదులుతున్న కార్బన్‌డైయాక్సైడ్‌ను మొక్కలు పీల్చుకుంటాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రామాంజనేయులు, మాధవి, ఏబీఓ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ డీఎంఈకు సన్మానం



సీనియర్ డీఎంఈ ప్రమోద్‌తో పాటు ఇతరులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయలో మంగళవారం గుత్తి డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రమోద్‌ను ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యులు సన్మానించారు. సీనియర్ డీఎంఈతో పాటు ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ప్రియాంక, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, ఈమె భర్త రమణను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి కొట్రికె అపర్ణ, శిరీషా, ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యులు మధు, సుధీర్, సుబ్రమణ్యం, ఇందు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నబీరసూల్

గుత్తి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నబీరసూల్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మంగళవారం డ్రగ్స్,ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నబీరసూల్ మాట్లాడుతూ డ్రగ్ అంటే మరణంతో సమానమన్నారు. డ్రగ్, మద్యం వల్ల కలిగే నష్టాలు వివరించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు

- నిరుపయోగంగా చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టు కార్యాలయాల భవనాలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- తలుపులు, కిటికీలు, మోటార్లు ఎత్తుకెళ్లిన దొంగలు



ముళ్లకంపల మధ్య భవనాలు

తాడిపత్రి రూరల్: చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టుల సమయంలో కట్టించిన భవనాలు నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఏళ్ల తరబడి భవనాలను ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వివరాలు.. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు సాగు,తాగునీరు అందించడానికి పెద్దపప్పూరు మండలం చాగల్లు వద్ద పెన్నానదిపై దాదాపు 244.05 కోట్లు, పరిసర ప్రాంతాల్లోని వంకల నుంచి వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టడానికి పెండేకల్లు వద్ద దాదాపు రూ.వందకోట్లతో పెండేకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఇంజినీర్లకు క్వార్టర్లు, కార్యాలయాల కోసం రూ.లక్షలు పోసి భవనాలు నిర్మించి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుల పనులు పూర్తి కావడంతో ఇక్కడున్న ఇంజినీర్లు, కార్యాలయాలు తరలిపోవడంతో భవనాలు నిరుపయోగంగా మారాయి.

అసాంఘిక కార్యాకలాపాలకు నిలయంగా..

ప్రస్తుతం ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. రాత్రి అయితే చాలు అక్కడ తాగుబోతులు దర్శనమిస్తున్నారు. వ్యభిచారం కూడా జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో కొందరు కాపర్లు గొర్రెల మందలను ఉంచుతున్నారు. భవనాలు నిరుపయోగంగా ఉండటంతో వాటికి ఉన్న అద్దాలు తలుపులు, చెక్క తలుపులు, మోటార్, పైపులు ఎత్తుకెళ్లారు. కిటికీలకు ఉన్న అద్దాలను పగులగొట్టారు. భవనం లోపల ఫ్లోరింగ్ కుంగిపోయింది. భవనాలను ముళ్లకంపలు కప్పివేశాయి. పునాదులు దెబ్బతిని నెర్రలు చీలాయి. మరికొంత కాలం వాటి గురించి పట్టించుకోకుంటే రూ.లక్షలు పోసి కట్టించిన భవనాలు ఎందుకు పనికి రాకుండా కూలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు


లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా వుంచి భవనాను ఎందుకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలకు అప్పగించకూడదు అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. ఐసీడీఎస్, హాస్టళ్లకు వీటిని ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ప్రైవేటు భవనాలకు అద్దె భారం తప్పుతుంది. తాడిపత్రి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి ప్రతి నెలా దాదాపు రూ.25 వేల అద్దె చెల్లించాల్సి వస్తోంది. కేవలం తాడిపత్రి పట్టణంలోని 66 అంగన్‌వాడీ సెంటర్లకు సమావేశాలు నిర్వహించాలంటే కార్యాలయం సరిపోక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రోడ్డుపై కుర్చోవాల్సిన పరిస్థితి. ఇక ప్రాజెక్టు పరిధిలోని దాదాపు 250పైగా వారికి ఒకేసారి సమావేశం జరపడం వీలుకాకపోవడంతో దాదాపు మూడేళ్లుగా జరపడమే మాని వేశారు. గతంలో కొన్నాళ్ల పాటు హెచ్చెల్సీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిరుపయోగంగా ఉన్న డీఈ కార్యాలయం



గొర్రెల మందకు నివాసంగా మారిన లోపలి భాగం



ధ్వంసమైన కిటీకి అద్దాలు

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి

గుత్తి: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని వక్త పేర్కొన్నారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు మోటార్ వెహికల్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి మాట్లాడుతూ విద్యార్థులందరూ మోటార్ వెహికల్ యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన రికార్డులు దగ్గర ఉంచుకోవలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో మంగళవారం దేవదాయశాఖ అధికారులు టెంకాయల విక్రయం హక్కు కోసం బహిరంగవేలం నిర్వహించారు. తాడిపత్రికి చెందిన పుట్లూరు ఆనంద్‌కుమార్ రూ.7,35,000కు వేలం దక్కించుకున్నారు. గతేడాదికంటే రూ. 2,85,000 అదనంగా ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.రామాంజినేయులు, ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. హోటల్ నిర్వహణ హక్కు వేలం వాయిదాపడిందని, త్వరలో వేలం నిర్వహిస్తామన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపు సద్వినియోగం చేసుకోండి



తరిమెలలో ఆధార్ స్పెషల్ క్యాంపును ప్రారంభించిన ఎంపీడీఓ రమణ

శింగనమల: మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బీవీ రమణ ప్రజలకు సూచించారు. శింగనమల, తరిమెల సచివాలయంలో మంగళవారం స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. వీటిలో ఈనెల 25 వరకూ, 26,27 తేదీల్లో వెస్ట్ నరసాపురం సచివాలయం, జూలకాల్వ సచివాలయం పరిధిలోని వారికి పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు ఆధార్ అప్డేట్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, బయోమెట్రిక్ అప్డేట్ వంటివి చేశారు. విద్యార్థులు భారీగా ఆధార్ క్యాంపుకు తరలివచ్చారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, సీఎండి రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు





బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు , పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తదితరులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో వెలిసిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోటలో ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయంలో బోనాలు ఉంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

వైభవంగా గంగమ్మ జాతర



ఐలమ్మ కాలనీలో అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న కాలనీ వాసులు

బుక్కరాయసముద్రం: ఐలమ్మ కాలనీలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. కాలనీలో మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగమయ్య, నాయకులు హరిక్రిష్ణ, నాగరాజు, భూషణ, నాగప్ప, ఈశ్వరమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పామిడమ్మ హారతి

పామిడి: పట్టణంలోని పామిడమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి అజయ్ అమ్మవారిని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా రుక్మిణీ పాండురంగ స్వామి బ్రహోత్సవాల అనంతరం వచ్చే మంగళవారం పామిడిమ్మ హారతిని నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఈసందర్భంగా భావసార క్షత్రియులు పామిడమ్మకు హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టుకు భక్తులు ప్రదక్షిణలు గావించారు. ఆలయం ఆవరణలో వెలసిన అంగళ్ల వద్ద భక్తుల సందడి కనిపించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మురళీధర్‌గుప్తా, శ్రీనాథ్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, పెద్ద మస్తానయ్య, వెంకట్రామిరెడ్డి, పాపిరెడ్డి, నాగరాజారావు, గోదశే రాజశేఖర్‌రావు, రంగనాయకులు, గోర్ల సుంకన్న, రమణ్‌రావు, టీటీ నాగభూషణ్‌రావు, శ్రీనివాసరావు, మంజునాథ్‌రావు, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



అలకంరణలో పామిడమ్మ

కోనుప్పలపాడులో పశుగర్భకోశ పరీక్షలు



పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

యాడికి: కోనుప్పలపాడు గ్రామంలో మంగళవారం పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. యాడికి పశువైద్యుడు సుబ్బారెడ్డి సుమారు 50 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేయడంతోపాటు 60 పశువులకు ముద్ద చర్మ వ్యాధి టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ డీడీ, పశుగర్భకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సుధాకర్ 50 పశువులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యంకు(పై దూడలు) సంబంధించి రూ.1,350 విలువైన రెండు సూదులను రైతులకు రూ.500కే అందిస్తున్నామన్నారు. రెండు సూదులు వేసినా దూడలు పుట్టక పోతే రైతులకు రూ.500 వెనక్కి ఇస్తామన్నారు. ఒకవేళ కుర్ర దూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తామన్నారు. విదేశీ జాతులనే కాకుండా స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ బ్రీడులను రైతులు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు విజయలక్ష్మి, ఏహెచ్‌ఏ సుగుణ, అంజలి, శ్రావణి, సురేష్, వినోద్‌బాబు, సుధాకర్ గోపాలమిత్ర ఆదిశేషయ్య పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి శివప్రసాద్ తెలియజేశారు. మంగళవారం ×సెర× స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కొడిమి సమీపంలోని ఆదరణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ×మహిళ సాధికారిత×పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి శివప్రసాద్ మాట్లాడుతూ మహిళలపై జరిగే లైంగిక దాడులను చట్టపరంగా ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేశారు. సెర సంస్థ అధ్యక్షుడు కుళ్లాయిస్వామి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. ధైర్యంగా ముందడుగు వేస్తున్నారన్నారు. వారికి రక్షణగా అనేక చట్టాలు వచ్చాయన్నారు. అనంతరం సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్సీ ప్రతినిధి శాంతామణి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి నర్మదా, రమాదేవి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పెరవలి విద్యార్థి



శశిధర్‌కుమార్

శింగనమల: మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.శశిధర్‌కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, పీడీ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. విద్యార్థి వచ్చే నెల శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటాడన్నారు. ఈసందర్భంగా శశిధర్‌కుమార్‌ను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు వాహనాల వేలం

బుక్కరాయసముద్రం: స్థానిక సెబ్ స్టేషన్‌లో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన 4 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ సునీత తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డుకు చెందిన మద్దినేని లక్ష్మీదీప్ బాంబే ఐఐటీలో సీటు సాధించాడు. అలాగే తరుణ్‌కుమార్ అనే విద్యార్థి ఇంటర్‌లో 971 మార్కులు సాధించడంతో మంగళవారం వారిని అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అనంతరం విద్యార్థులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. మాజీ కౌన్సిలర్ ఆంజి, నాయకులు బండారు ఆనంద్, లాయర్ బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు

కూడేరు: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందొచ్చని మండల వ్యవసాయాధికారి విజయ కుమార్ తెలిపారు. కమ్మూరు,తిమ్మాపురం, మరుట్ల, ఉదిరిపికొండ, పి.నారాయణపురం, ముద్దలాపురం సచివాలయాల పరిధిలో భూసార పరీక్షల్లో భాగంగా సేకరించిన మట్టి నమూనాలను వ్యవసాయాధికారులు మంగళవారం ల్యాబ్‌కు తరలించేందుకు సిద్ధం చేశారు. ఏఓ విజయ కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేల స్వభావం తెలుస్తుందన్నారు. భూమిలో ఉండే పోషకాలను తెలుసుకోవచ్చని, సాగు చేసిన పంటలకు తగ్గ రసాయన ఎరువును వాడుకోవచ్చన్నారు. ఇప్పేరు, అరవకూరు, కూడేరు, చోళసముద్రం, గొటుకూరు సచివాలయ పరిధిలోని భూముల్లో భూసార పరీక్షలు బుధవారం నుంచి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏఈఓ శైలజ, వీహెచ్‌ఏలు సాజియా, రాజ్‌కుమార్, శ్రీలత పాల్గొన్నారు.


బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు



గంగాధర్‌యాదవ్

తాడిపత్రి అర్బన్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించారని బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అందించడంతోపాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలవరానికి మరిన్ని నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్రం సహాయ సహకారాలు అందించడం స్వాగతిస్తున్నామన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, విశాఖ, చెన్నై కారిడార్లో కొప్పర్తికి,హైదరాబాద్, బెంగళూరు కారిడార్లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

ఏపీకి టోపీ



జి.నాగిరెడ్డి

తాడిపత్రి అర్బన్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి టోపీ పెట్టిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.నాగిరెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఎటువంటి హామీ ఇవ్వకపోగా నిధులు కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇది రైతు, పేదల, నిరుద్యోగుల వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు.

జలధికి తరలిన పీర్లు



పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



గార్లదిన్నె మండలం కనంపల్లిలో జలధికి తరలుతున్న పీర్లు

పెద్దపప్పూరు: మొహర్రంలో భాగంగా కొట్టాలపల్లిలో మంగళవారం పీర్ల జలధి కార్యక్రమం జరిగింది. ఉదయం పీర్లను గ్రామంలో ఊరేగించారు. ఈసందర్భంగా పీర్లను డప్పు వాయిద్యాల నడుమ అగ్నిగుండ ప్రవేశం చేయించారు. యువకులు అలావ్ తొక్కారు. సాయంత్రం పీర్లను ఊరేగించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన సంగీత గురువు నారాయణస్వామి, కర్నూలుకు చెందిన చంద్రకళ శిష్య బృందం నిర్వహించిన పండరి భజన ఆకట్టుకుంది.

గార్లదిన్నె: కనంపల్లి, కమలాపురం, శిరివరం గ్రామాల్లో మంగళవారం పీర్ల జలధి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించి అగ్నిగుండం ప్రవేశం చేయించారు. సాయంత్రం పీర్లను ఊరేగించి జలధికి తరలించారు.